నమస్తే తెలంగాణ
మంచిర్యాల కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 16 మే 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

### ❖ డీఎంఎఫ్టీ నిధులు దుర్వినియోగం

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మహిళలకు ఉపయోగపడేలా భవనాలు నిర్మించాలని నిధులు ఇచ్చారు. కానీ మా పౌనూరులో మహిళా భవనాన్ని ఎందుకు క్యాన్సల్ చేశారో అధికారులు, నాయకులు సమాధానం చెప్పాలి. కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదనే క్యాన్సల్ చేశారా.. అన్నది స్పష్టం చేయాలి. అసలు జనావాసాలు లేని దగ్గర రోడ్లు ఎందుకు వేశారో అర్థం కావడం లేదు. మా ఊరు ఏం అన్యాయం చేసిందని భవనాన్ని రద్దు చేశారో కచ్చితంగా సమాధానం చెప్పి తీరాలి. మహిళలకు నష్టం చేసి కాంట్రాక్టర్‌కు బెనిఫిట్ చేసేందుకు రోడ్లు నిర్మించారు. ఓట్లు వేయలేదని మా ఊరు ప్రజల మీద కక్షగట్టారు. ఓ కాంగ్రెస్ లీడర్ తన భూమికి పోయేందుకు డీఎంఎఫ్టీ నిధులతో రోడ్డు వేసుకున్నాడు. మహిళా భవనాల కోసం మంజూరు చేసిన రూ.45 లక్షలు దుర్వినియోగం చేశారు. డీఎంఎఫ్టీ నిధులు ప్రజల కోసం, ప్రజావసరాల కోసం వాడాలి. కానీ ఓ నాయకుడి స్వార్థం కోసం, ఆయనకు లబ్ధి చేకూర్చడం కోసమే పనులు చేశారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

**- జాడి ఏసయ్య, జైపూర్ మాజీ ఎంపీపీ**



పౌనూర్‌లో తన భూమికి వెళ్లేందుకు కాంగ్రెస్ నేత నిర్మించినట్లు ఆరోపణలు వస్తున్న రోడ్డు





జనావాసాలు లేని చోట నిర్మించిన రోడ్డు



### మా ఊరు ఏం అన్యాయం చేసింది

మా ఊరు ఏం అన్యాయం చేసిందని మహిళా భవనాన్ని రద్దు చేశారు. మా ఊరిలో భవన నిర్మాణానికి ఇచ్చిన డబ్బులతో మా దగ్గర ఖర్చు పెట్టకుండా శివ్వారం, పౌనూర్‌కు ఎందుకు తరలించారు. మాపై ఎందుకు కక్ష కట్టారు. మా గ్రామంలో కూడా రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఇక్కడ పెట్టకుండా పక్కనున్న గ్రామాలకు ఆ నిధులు ఎందుకు ఇచ్చారు. ఇది సరైన పద్ధతి కాదు. అవసరం లేని దగ్గర రోడ్లు నిర్మించిన కాంట్రాక్ట్‌పై చర్యలు తీసుకోవాలి. మండలంలోని అన్ని గ్రామాల్లో మాదిరిగానే మా ఊరిలోనూ మహిళా భవనాన్ని నిర్మించాలి.

**- బోయిని నాగరాజు, నర్సింగాపూర్ గ్రామస్థుడు**

- ఆ నిధులతో కాంట్రాక్టర్ (హస్తం నేత) జేబులు నింపే పనులు
- జనావాసాలు వదిలి, ఏమీ లేని చోట్ల రోడ్లు
- సదరు లీడర్ ప్రైవేట్ ప్రాపర్టీకి వెళ్లేందుకు సీసీ రహదారి
- డీఎంఎఫ్టీ నిధులు దుర్వినియోగం అయ్యాయంటున్న స్థానికులు
- స్థానిక ఎమ్మెల్యే, సదరు నాయకుడి తీరుపై మండిపడుతున్న జనం

# మహిళా భవనాలు రద్దు చేసి.. అవసరం లేని చోట రోడ్లేసి..!

## జైపూర్ మండలంలో మూడు భవనాలు రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు

మంచిర్యాల, మే 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'తెలంగాణలోని ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యం. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.34 వేల కోట్లు కేటాయించి ఆ మొత్తాన్ని మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించాం. అదానీ, అంబానీలకే పరిమితమైన సోలార్ పవర్ ప్రాజెక్టులను మహిళా సంఘాలకు ఇచ్చి.. వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది కోటీశ్వరులను చేస్తాం.' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ప్రకటనలు గుప్పిస్తుండగా, పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నది. బీఆర్‌ఎస్ సర్కారులో మంజూరైన మూడు మహిళా సంఘాల భవనాలను రద్దు చేయించిన కాంగ్రెస్ నేతలు.. ఆ నిధులతో జనావాసాలు లేని చోట్ల.. సొంత ప్రాపర్టీకి వెళ్లేలా రోడ్లు నిర్మించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమవుతున్నది.

### మహిళా భవనాలు రద్దు చేసి.. ఆ నిధులతో రోడ్లు..

మహిళా సంఘాలకు ఊతమిచ్చే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బాల్కసుమన్ గ్రామానికో మహిళా భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలతో పాటు జైపూర్ మండలంలోని 20 గ్రామాల్లోనూ ఈ భవనాలు నిర్మించేందుకు డీఎంఎఫ్టీ కింద నిధులు మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ.15 లక్షలు కేటాయించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చెన్నూర్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేశారు. ఆ కృషి ఫలితంగా చాలా గ్రామాల్లో ఇప్పటికే మహిళా భవనాల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. ఇక ఇదిలా ఉంటే జైపూర్ మండలం శివ్వారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ లీడర్ మాత్రం మహిళా సంఘాల కడుపుకొట్టి.. తాను జేబులు నింపుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పౌనూర్, శివ్వారం, నర్సింగాపురం గ్రామాల్లో మహిళా భవనాలను రద్దు చేయడం, ఆ భవనాలకు కేటాయించిన రూ.45 లక్షల డీఎంఎఫ్టీ నిధులతో జనావాసాలు లేని ప్రాంతాల్లో, అవసరం లేని దగ్గర రోడ్ల నిర్మాణాలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా నాయకుడిగా చెప్పుకునే ఆ లీడర్ ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే డీఎంఎఫ్టీ నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఓట్లు రాలేదని కక్ష కట్టారా..

పౌనూర్, శివ్వారం, నర్సింగాపురం గ్రామాల్లో మహిళా భవనాలను రద్దు చేయడానికి అసలు కారణం, ఎమ్మెల్యే ఎన్నికల్లో అధికార పార్టీకి తక్కువ ఓట్లు రావడమేనని స్థానికులు అంటున్నారు. లీడ్ రాలేదని, బీఆర్‌ఎస్‌కు ఎక్కువ ఓట్లు పడ్డాయనే తమ గ్రామాలపై కక్ష కట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా నాయకుడిగా చెప్పుకుంటున్న శివ్వారానికి చెందిన సదరు కాంగ్రెస్ లీడర్ ఇన్‌చార్జిగా ఉన్న ఈ మూడు గ్రామాల్లో ఓట్లు రాకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే ఉద్దేశ పూర్వకంగానే మహిళా భవనాలను రద్దు చేయించారంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. మహిళా భవనాలను రద్దు చేసి పౌనూర్‌లోని తన ప్రైవేట్ ప్రాపర్టీకి వెళ్లేందుకు సీసీ రోడ్డు వేసుకున్నారని మండిపడుతున్నారు. జక్కయ్య ఇంటి నుంచి డంప్ యార్డుకు స్వలాభం కోసం, రానున్న రోజుల్లో తాను చేసే వ్యాపారం కోసం సర్కార్ సొమ్ముతో రోడ్డు వేసుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇలా వ్యక్తిగత అవసరాలకు డీఎంఎఫ్టీ నిధులను దుర్వినియోగం చేయడం చట్టప్రకారం నేరమని.. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మూడు మహిళా భవనాలను రద్దు చేసి వేసిన రోడ్లు ఏవీ కూడా జనవాసాల్లో లేవంటున్నారు. అవసరం లేని చోట్ల రోడ్లు ఎందుకు వేయాల్సి వచ్చిందో అధికారులు విచారించాలంటున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళా భవనాలు నిర్మించి.. మా మూడు గ్రామాల్లో ఎందుకు నిర్మించడం లేదని, దీనికి కారణమేమిటో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఓట్లు వేయకపోతే మహిళా భవనాలను రద్దు చేసి కాంగ్రెస్ లీడర్ల సొంత అవసరాలకు రోడ్లను నిర్మించుకుంటారా.. అని నిలదీస్తున్నారు. నర్సింగాపురం గ్రామంలో మహిళా భవనాన్ని రద్దు చేసినప్పుడు.. దానికి సంబంధించిన రూ.15 లక్షలు ఆ గ్రామంలోనే ఖర్చు చేయాలి. కానీ, ఇక్కడ మాత్రం నర్సింగాపురంకు కేటాయించిన డబ్బులతో శివ్వారం, పౌనూర్‌తో పాటు వేలాల గ్రామాల్లో పనులు చేశారు. దీనిపై నర్సింగాపూర్ గ్రామస్తులు మండిపడుతున్నారు. మా ఊరులో ఆ నిధులు ఖర్చు చేయకుండా పక్క గ్రామాలకు తరలించారంటూ వాపోతున్నారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఈ విషయంలో పక్షపాతంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూ.45 లక్షల డీఎంఎఫ్టీ నిధులు దుర్వినియోగం చేశారని.. కాంట్రాక్టర్‌గా ఉన్న సదరు కాంగ్రెస్ లీడర్ జేబులు నింపేందుకు పనులు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి నిధులు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరాకు ఒప్పందం

శ్రీరాంపూర్, మే 15 : ఈ ఆర్థిక సంవత్సరం 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేసేందుకు ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గాపూర్‌లోగల ఎన్‌ఎస్పీసీఎల్‌తో గురువారం సింగరేణి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. సింగరేణి చైర్మన్-ఎండీ ఎన్ బలరామ్ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూమెంట్ ఎస్డీఎం సుభాని సమక్షంలో సింగరేణి జనరల్ మేనేజర్ మార్కెటింగ్ ఎన్ వీ రాజశేఖర్‌రావు, ఎన్‌ఎస్పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జనరల్ మేనేజర్లు నీల్ కమల్, పలాష్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. ప్రముఖ జాతీయ బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన ఎన్టీపీసీ, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఏర్పాటు చేసుకున్న జాయింట్ వెంచర్ కంపెనీ ఎన్‌ఎస్పీసీఎల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో దుర్గాపూర్ వద్ద ఏర్పాటు చేసిన థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఈ బొగ్గును సరఫరా చేయనున్నారు. సింగరేణి సంస్థ నాణ్యత గల బొగ్గును తగిన పరిమాణంలో సకాలంలో అందజేస్తుందని, కనుక తాము ఈ కంపెనీ నుంచి బొగ్గు కొనడానికి ముందుకు వచ్చామని ఎన్‌ఎస్పీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్లు శ్రీనివాసరాజు, సురేందర్‌రాజు పాల్గొన్నారు.

## జన్నారం బీట్ ఆఫీసర్ సస్పెన్షన్



జన్నారం బీట్ ఆఫీసర్ శ్రీనివాస్

జన్నారం, మే 15 : జన్నారం బీట్ ఆఫీసర్ శ్రీనివాస్‌ను సస్పెన్షన్ చేయడమేగాక డీఆర్వో తిరుపతికి మెమో జారీ చేసినట్లు ఎఫ్‌డీఫ్‌టీ శాంతారాం గురువారం తెలిపారు. గతంలో కొత్తూర్ పల్లె అటవీ ప్రాంతంలో గిరిజనులు వేసుకున్న గుడిసెలను తొలగించారు. తిరిగి అదేప్రాంతంలో కొందరు గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయమై సమాచారమివ్వనందుకు.. అటవీ భూముల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినందుకుగాను శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు శాంతారాం తెలిపారు. అటవీ సిబ్బంది విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



తాండూర్ : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## సమీకృత మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

తాండూర్/బెల్లంపల్లి, మే 15 : ప్రజలకు కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సమీకృత కూరగాయల మార్కెట్‌ను వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి షాపుల కేటాయింపు కోసం లబ్ధిదారులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 31 షాపులకు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

### రైతులకు టార్పాలిన్లు సమకూరుస్తాం

భీమారం, మే 15 : అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు సమకూరుస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన పోలంపల్లి, ఖాజీపల్లి వరిధాన్య కొనుగోలు కేంద్రాలతో పాటు భూభారతి సదస్సుల ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్‌ఎస్ సౌకర్యం కల్పించడంతో పాటు అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు అందేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఎంపీడీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



వడ్లపై టార్పాలిన్లు కప్పి ఉన్న ఈ దృశ్యం దహెగాం కొనుగోలు కేంద్రంలోనిది. గతేడాది ఈ కేంద్రంలో ఇదే సమయానికి 60 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈసారి మాత్రం ఇప్పటి వరకు కేవలం 7,200 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. ఈ ఏడాది దాదాపు 15 రోజులు ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు సకాలంలో ధాన్యాన్ని అమ్మలేకపోయారు. ప్రస్తుతం అకాల వర్షాలతో ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతూ ఆందోళనకు చెందుతున్నారు.



వర్షానికి తడవకుండా ధాన్యంపై టార్పాలిన్ కప్పి ఉన్న ఈ దృశ్యం పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరు లోనిది. పెంచికల్‌పేట్ మండలంలో 200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 240 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించడం.. దీనికితోడు అకాల వర్షాలు తోడవడంతో రైతులు వడ్లను కాపాడుకునేందుకు అవస్థలు పడాల్సి వస్తున్నది.

## కేంద్రాల్లో ధాన్యం.. వర్షాల భయం

- ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతన్నకు తప్పని తిప్పలు
- వర్షాల నుంచి వడ్లు కాపాడుకునేందుకు నానా అవస్థలు
- ఇప్పటికే పలుచోట్ల తడిసిన ధాన్యం కుప్పలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతాంగం నానా అవస్థలు పడాల్సి వస్తున్నది. వరి కోతల ప్రారంభానికి ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాల్సిన యంత్రాంగం.. కోతలు ముగిసిన పక్షం రోజుల తర్వాత ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం వర్షాల నుంచి వడ్లను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

### సేకరణంలో జాప్యం.. రైతన్నకు నష్టం

15 మండలాల పరిధిలో జిల్లా సహకార సంస్థ, ఐకేపీల ఆధ్వర్యంలో 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందకు భిన్నంగా ఉన్నది. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం.. సేకరణలో జాప్యం వల్ల కర్షకులు నష్టపోవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### కొన్నది 5 వేల మెట్రిక్ టన్నులే..

జిల్లా వ్యాప్తంగా 24 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ యాసంగిలో 55 వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనాలు వేశారు. కానీ, ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాల్లో సుమారు 5 వేల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేని దుస్థితి నెలకొన్నది. రైతులు పండించిన ధాన్యాన్ని సగం కూడా కొంటారో.. లేదోననే ఆందోళన నెలకొన్నది. వారం రోజులుగా అకాల వర్షాలతో రైతులు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు కవర్లు కప్పిఉంచుతున్నారు. అయినప్పటికీ అక్కడక్కడా వరదకు వడ్లు తడిసి ముద్దయి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి తలెత్తుతున్నది. కోటి ఆశలతో సాగు చేసిన పంటకు ఫలితముంటుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రాజన్న, కాలనీ వాసులు

వేమనపల్లి, మే 15 : తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న ఆధ్వర్యంలో జిల్లెడలోని ఎస్సీ కాలనీ వాసులు గురువారం నిరసన చేపట్టారు. రాజన్న మాట్లాడుతూ కొన్ని రోజులుగా కాలనీ వాసులు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బోరు చెడిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని, కాలనీ వాసులు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకుంటున్నామని, సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్, ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి వెంటనే కాలనీలో బోరు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జమున, శ్యామల, లచ్చక్క, బక్కక్క, బుచ్చక్క, సాలక్క, భీమయ్య, చీకటి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.




